# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో సమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు.**
2. **ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0లో 5 లక్షల ఇళ్లు ఆంధ్రప్రదేశ్‌కు మంజూరయ్యేలా చర్యలు చేపట్టామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**
3. **తెలంగాణలో కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు రీ సర్వే నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**
4. **రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు.**
5. **"వాతావరణ మార్పు- ప్రకృతి పరిరక్షణకు శక్తివంతమైన సాధనం రేడియో" అన్న ఇతివృత్తంతో ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

==========================

సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో సమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఈ నెల 24వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానుండగా.. 28వ తేదీన పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులతో గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో బడ్జెట్ కూర్పుపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఎన్నికల హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలకు కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించనున్నారు.

---------------------------

ప్రధానమంత్రి ఆవాస్ యోజన..పీఎంఏవై 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి 5 లక్షల ఇళ్లు ఆంధ్రప్రదేశ్‌కు మంజూరయ్యేలా చర్యలు చేపట్టామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. వీటికి అర్హుల ఎంపిక కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సర్వే జరుగుతోందని వెల్లడించారు. గుంటూరు జిల్లా వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో పీఎంఏవై 1.0 పథకం గడువును ఈ ఏడాది చివరి వరకు పెంచారని తెలిపారు.

ఈ పథకం కింద కూటమి ప్రభుత్వంలో లక్షా 15 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిందని మంత్రి పార్థసారథి వివరిస్తూ...

....వాయిస్...33 సెకన్లు

---

తెలంగాణలో కులగణన సర్వే శాస్త్రీయంగా జరిగిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వివిధ కారణాల వల్ల కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం మరో అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు సర్వే సిబ్బందికి వివరాలు అందజేయాలని సూచించారు.

రాష్ట్ర జనాభాలో 3.1 శాతం మంది గతంలో జరిపిన సర్వేలో పాల్గొనలేదని, ఈ నేపథ్యంలో వారిని రాష్ట్ర జనాభా లెక్కల్లోకి తీసుకురావడం కోసం మరోసారి సర్వే చేయాలని నిర్ణయించుకున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

---

తెలంగాణాలో 93 లక్షల గృహాలను డిజిటల్ కనెక్టివిటీ పరిధిలోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. టీ ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రారంభించామని ప్రపంచబ్యాంకు ప్రతినిధుల బృందానికి వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద డిజిటలైజేషన్ చేపట్టిన నాలుగు గ్రామాలను ఈ బృందం సందర్శించి తమ అనుభవాలను మంత్రితో పంచుకుంది. మరో మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు కనెక్టివిటీని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామంటూ ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు వారికి తెలిపారు.

---

బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోని మూడు ఫారాల్లోనే కోళ్లు చనిపోయాయని.. వాటి నమూనాలు భోపాల్ పంపగా బర్డ్‌ఫ్లూ అని తేలిందని తెలిపారు. బర్డ్‌ఫ్లూ వైరస్ అని తేలిన కోళ్లఫారాల పరిధిలో నియంత్రణ చర్యలు చేపట్టామని ప్రజలు ఆందోళన చెందవద్దని మంత్రి వివరిస్తూ..

...వాయిస్.. 39 సెకన్లు

---

ఈ రోజు ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ప్రపంచ ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలకు సంబంధించిన వివరాలను, విజ్ఞాన..వినోద కార్యక్రమాలను ప్రసారం చేస్తూ రేడియో ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకుంది. ఐక్యరాజ్యసమితి 1946 ఫిబ్రవరి 13వ తేదీన రేడియోను ఏర్పాటు చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక వ్యవహారాల సంస్థ.. యునెస్కో కూడా ఫిబ్రవరి 13వ తేదీని రేడియో దినోత్సవంగా

నిర్వహించాలని తన 36వ సర్వ సభ్య సమావేశంలో తీర్మానించింది. రేడియో ప్రాముఖ్యం గురించి ప్రజలలో అవగాహన పెంపొందించడం, ప్రసార కర్తల మధ్య అంతర్జాతీయ స్థాయిలో సహకారాన్ని పెంచడం రేడియో దినోత్సవ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. మన దేశంలో ఆకాశవాణి పేరుతో రేడియో తన వినూత్నమైన, వైవిధ్య భరితమైన కార్యక్రమాలతో నిష్పాక్షికమైన వార్తా ప్రసారాలతో ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించింది. "వాతావరణ మార్పు- ప్రకృతి పరిరక్షణకు శక్తివంతమైన సాధనం రేడియో" అన్న ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ రేడియో దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సిఫీ టెక్నాలజీస్ సుముఖత వ్యక్తం చేసింది. సిఫీ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజు వేగేశ్న గుంటూరు జిల్లా ఉండవల్లిలో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్‌తో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలో మెగా డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రస్తుతం ఉన్న అవకాశాలు, ప్రభుత్వ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు, కొత్తగా ప్రవేశ పెట్టిన ఐటీ పాలసీ గురించి మంత్రి లోకేశ్ ఆయనకు వివరించారు. అలాగే.. హిందుస్తాన్ కోకాకోలా బేవరేజెస్ ప్రతినిధి పాబ్లో రోడ్రిగ్ బ్రోవాటో బృందం కూడా మంత్రితో సమావేశ మైంది. రాష్ట్రంలో పెట్టుబడులు కొనసాగించేందుకు ఉన్న స్నేహపూర్వక వాతావరణాన్ని కోకాకోలా ప్రతినిధులకు లోకేశ్ వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-2 ప్రధాన పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు ఈరోజు నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. ఏపీపీఎస్సీ ప్రకటించింది. అభ్యర్థులు ముందుగానే డౌన్‌లోడ్ చేసుకుని అందులోని సూచనలను పాటించాలని పేర్కొంది. గ్రూప్-2 ప్రధాన పరీక్షలు ఈ నెల 23వ తేదీన 13 జిల్లా కేంద్రాల్లో జరగనున్నాయి. పేపర్-1 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల 30 నిమిషాల వరకు, పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు జరుగుతుంది.

---------------------------

రంజాన్ మాసంలో విధుల నుంచి గంట ముందుగా వెళ్లేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లోని ముస్లిం ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. వచ్చే నెల 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మతపరమైన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఈ వెసులుబాటును వర్తింపజేస్తూ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులు, ఒప్పంద, పొరుగు సేవలు, గ్రామ, వార్డు సచివాలయాలు తదితర శాఖల్లోని ముస్లిం ఉద్యోగులందరికీ ఈ వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కెట్ యార్డుల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా, సంరక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో నిన్న ఆయన మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్కెటింగ్ శాఖకు చెందిన స్థలాల వివరాలతో పాటు అధిక విలువగల స్థలాలను సంరక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కోరారు. మార్కెట్ స్థలాలను ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో అద్దెకివ్వడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే మార్గాలపై ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులకు అచ్చెన్నాయుడు సూచించారు.

=====================